## క్రిస్మస్ వేడుకలకు ముస్తాబు

వేములవాడ అర్బన్/గంభీరావుపేట/బోయిన పల్లి/ ఇల్లంతకుంట: జిల్లాల్లోని పలు మండలాల్లో క్రిస్మస్ వేడుకలకు చర్చిలు ముస్తాబయ్యాయి. ప్రార్థనా మందిరాలను విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. వేములవాడ పట్టణంలోని నాంపల్లి శాంతినగర్ చర్చిలో ఏటా మాదిరిగానే ఈసారి కూడా పశువుల పాక ఏర్పాటు చేసి అందంగా తీర్చిదిద్దారు. బుధవారం జరిగే క్రిస్మస్ వేడుకలను క్రైస్తవులు ఘనంగా జరుపుకోనున్నారు.



వేములవాడ అర్బన్ : ముస్తాబైన నాంపల్లి శాంతినగర్ చర్చి



బోయినపల్లి : తడగొండ చర్చి..



ముస్తాబాద్: పట్టణంలోని మురుగునీరు మానేరు ప్రాజెక్టు కెనాల్‌లో నేరుగా కలుస్తోందని రైతులు తెలుపుతున్నారు. కెనాల్‌లోని మురుగునీటిని శుభ్రం చేయకపోవడంతో పొలాల్లో చేరుతోందని వారు వాపోతున్నారు. నాటు వేసేందుకు కూడా కూలీలు రావడం లేదని, కెనాల్‌లో మురుగునీరు కలువకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

**సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి :**
**బీరయ్య, ఎంపీడీవో, సెల్‌నెంబర్ : 9676973358**

**వాట్సాప్ చేయండి..**

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

**మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626**

## క్లుప్తంగా

### రవితేజకు సత్కారం



సత్కరిస్తున్న సాంస్కృతికశాఖ పెద్దలు

సిరిసిల్లకల్చరల్: జిల్లాలోని వేములవాడ నియోజకవర్గానికి చెందిన ప్రముఖ జానపద కళాకారుడు, మిమిక్రీ ఆర్టిస్ట్ బొమ్మెన రవితేజను రాష్ట్ర సాంస్కృతిక శాఖ సత్కరించింది. జానపద కళారంగంలో చేస్తున్న సేవలను గుర్తించి సత్కారానికి ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. భాషా సాంస్కృతిక శాఖ, యువ కళావాహిని, రాష్ట్ర జానపద కళాకారుల సంఘం సంయుక్త నిర్వహణలో హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో సత్కారంతో పాటు నగదు బహుమతినిచ్చి గౌరవించారు. కళాకారుల సంఘం కొండల రావు, విశ్రాంత ప్రభుత్వ సలహాదారు, సంఘం గౌరవాధ్యక్షుడు కేవీ రమణాచారి, సంగీత నాటక అకాడమీ చైర్మన్ అలేఖ్య, రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మన్ వెన్నెల, దైవజ్ఞ శర్మ, కళాకారులసంఘం ప్రతినిధులు శ్రీనివాస్ గౌడ్, విజయ, కవిత, కళాకారులు పాల్గొన్నారు.

### కరపత్రాల ఆవిష్కరణ

సిరిసిల్ల కల్చరల్: సాయుధ పోరాటమే స్ఫూర్తిగా సామాన్యుల హక్కుల కోసం పోరాడుదామని సీపీఐ జిల్లా నాయకులు గుంటి వేణు, పంతం రవి అన్నారు. మంగళవారం బీవైనగర్ జెండా చౌరస్తాలో బద్దం ఎల్లారెడ్డి వర్ధంతి సభకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాయుధ రైతాంగ పోరాటంలో రజాకర్లకు వ్యతిరేకంగా పోరాడిన ఎల్లారెడ్డి పీడిత ప్రజల విముక్తి కోసం కృషి చేశారన్నారు. కార్మికులకు పని కల్పించాలని, యారన్ సబ్సిడీ, విద్యుత్ సబ్సిడీని కొనసాగించాలన్నారు. ఇళ్లులేని పేదలకు స్థలాలిచ్చి రూ.5లక్షలు ఇవ్వాలని డిమాండ్‌చేశారు. డిమాండ్ల పరిష్కారం కోసం ఈనెల 30న బద్దం ఎల్లారెడ్డి వర్ధంతి సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి, కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి హాజరుకానున్నట్లు చెప్పారు. సీపీఐ నాయకులు నల్ల చంద్రమౌళి, లింగం, తదితరులు పాల్గొన్నారు.

### అక్రిడిటేషన్ కార్డుల గడువు పెంపు

సిరిసిల్లకల్చరల్: జర్నలిస్టులకు ప్రభుత్వం జారీ చేసిన గుర్తింపు కార్డుల వ్యాలిడిటీ గడువును మరో మూడు నెలలు పొడిగించింది. ఈ మేరకు పౌర సంబంధాల శాఖ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. గతంలో విడుదలైన ఆదేశాల మేరకు ఈ నెల 31తో కార్డుల వ్యాలిడిటీ ముగియనుంది. జర్నలిస్టులకు అసౌకర్యం కలగకూడదనే ఉద్దేశంతో మార్చి 31 వరకు కార్డుల వ్యాలిడిటీని పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా పౌర సంబంధాల అధికారి శ్రీధర్ తెలిపారు. ఈ మేరకు ఆర్టీసీ అధికారులకు సమాచారం ఇచ్చినట్లు పేర్కొన్నారు.

### సూచికబోర్డులు ఏర్పాటు చేస్తాం

**సాక్షి స్పందన**

ఎల్లారెడ్డిపేట: మండలంలోని అల్మాస్‌పూర్ గ్రామ శివారు ఎల్లమ్మ ఆలయం వద్ద ఉన్న ప్రమాదకర మూలమలుపుల వద్ద సూచిక బోర్డుల ఏర్పాటుకు అధికారులు నిర్ణయించారు. మంగళవారం «సాక్షి»లో «సూచికబోర్డులేవీ?» అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆర్అండ్‌బీ అధికారులు స్పందించారు. మూలమలుపుల వద్ద సూచికబోర్డుల ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, మంజూరుకాగానే ఏర్పాటు చేస్తామని జిల్లా ఆర్అండ్‌బీ అధికారి వెంకటరమణయ్య తెలిపారు.

### పైసలకు అంగన్‌వాడీ పోస్టులు ?

సిరిసిల్లక్రైం: జిల్లాలో అంగన్‌వాడీ ఆయాలకు టీచర్లుగా పదోన్నతి కల్పించేందుకు డబ్బులు అడిగినట్లు ప్రచారం ఊపందుకుంది. దీనిలో కీలకంగా ఓ అంగన్‌వాడీ యూనియన్ లీడర్ హస్తం ఉన్నట్లు జిల్లా సంక్షేమాధికారికి ఆడియో అందినట్లు విశ్వసనీయంగా తెలిసింది. అంగన్‌వాడీ ఆయాలుగా ఉండి పదోన్నతి వారి విద్యార్హతలు, పని చేసిన సర్వీస్ ఆధారంగా లభిస్తాయని, మధ్యవర్తుల మాటలు నమ్మవద్దని జిల్లాలోని అంగన్‌వాడీ టీచర్స్‌కు జిల్లా కార్యాలయం నుంచి ఓ వాట్సాప్ మెస్సేజ్ చేరింది. ఉద్యోగాల పేరిట ఎవరు డబ్బులు అడిగినా వారిని ఏసీబీకి పట్టించాలని, అందరూ అలర్ట్‌గా ఉండాలని జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం తెలపడం సంబంధిత శాఖ అధికారుల్లో చర్చ జోరందుకుంది.

# పేదింటి ఆడబిడ్డకు వరం కల్యాణలక్ష్మి

- విప్ ఆది శ్రీనివాస్



చెక్కులు పంపిణీ చేస్తున్న విప్ ఆది శ్రీనివాస్

వేములవాడరూరల్: పేదింటి ఆడబిడ్డకు కల్యాణలక్ష్మి వరమని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మంగళవారం వేములవాడ పట్టణంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో రూరల్ మండల పరిధిలోని 43 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్, రూ.8.75 లక్షల విలువగల 26 సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ, ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ ముందుకు వెళ్తున్నామని పేర్కొన్నారు. జనవరి నుంచి రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేస్తామని, త్వరలోనే రేషన్ కార్డులు మంజూరు చేయనున్నట్లు పేర్కొన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వైస్ చైర్మన్ కనికరపు రాకేశ్, తహసీల్దార్ డి.సుజాత, ఎంపీడీవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**అధికారులు జాగ్రత్తగా వ్యవహరించాలి**

ప్రభుత్వ ఉద్యోగిగా ఉన్నత స్థానంలో ఉన్న అధికారులు జాగ్రత్తగా వ్యవహరించాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వారికి సూచించారు. వేములవాడ రూరల్ మండలంలోని పలు గ్రామాలకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఇటీవల కొంతమంది అధికారుల మాటలతో ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని, ఇక ముందు అలా జరగకుండా అధికారులు ఆలోచించి జాగ్రత్తగా మాట్లాడాలని సూచించారు.

**నాయీ బ్రాహ్మణుల సమస్యలు పరిష్కరించాలి**

వేములవాడ: వేములవాడ అర్బన్, రూరల్ నాయీ బ్రాహ్మణ సభ్యులు రాజన్న ఆలయంలో రెండో కల్యాణకట్టలో పనిచేస్తున్న నాయీబ్రాహ్మణులు టికెట్ కమిషన్‌తోపాటు పలు సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈవోతో మాట్లాడి సమస్య పరిష్కారంకోసం కృషిచేస్తానని విప్ హామీ ఇచ్చినట్లు సంఘం అధ్యక్షుడు నర్సయ్య, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, నర్సింహులు, తిరుపతి, నరేష్, వెలిశాల తిరుపతి, తిరుపతి, రవి తెలిపారు.

## సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



సమగ్ర శిక్ష శిబిరంలో టీపీటీఎఫ్ నాయకులు

తంగళ్లపల్లి: సమగ్ర శిక్ష ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాతూరి మహేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం కేజీబీవీ, యూఆర్ఎస్, సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం చేస్తున్న సమ్మెకు మద్దతుగా టీపీటీఎఫ్ జిల్లా శాఖ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగ భద్రత, వైద్య సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. పంజాబ్, మణిపూర్, త్రిపుర, హిమాచల్‌ప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల్లో సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉద్యోగులను క్రమబద్ధీకరించారన్నారు. టీపీటీఎఫ్ జిల్లా దుమాల రమానాథ్ రెడ్డి, జిల్లా క్యాదర్శులు పర్వతి తిరుపతి, రామచంద్రం, బండి ఉపేందర్, దూస సంతోష్, శ్రీరామోజు శ్రీనివాస్, సుల్తాన్ శ్రీనివాస్, ఎస్ఎస్ఏ ఎస్‌వోలు ఉద్యోగుల సంఘం నాయకులు దేవయ్య, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

## ముందస్తు క్రిస్మస్ వేడుకలు



గంభీరావుపేట: నర్మాల చర్చిలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న అధికారులు, పాస్టర్లు

గంభీరావుపేట: మండలంలోని నర్మాల మానేరు హార్వెస్ట్ చర్చిలో మంగళవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా అధికారులు, పాస్టర్లు, క్రిస్టియన్లు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. చర్చి ఫాదర్ రత్నాకర్, తహసీల్దార్ భూపతి, ఆర్ఐలు దేవరాజు, సత్యనారాయణ, మాజీ సర్పంచ్ ఎడబోయిన రాజు, మాజీ ఎంపీటీసీ బాలమణి తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేట: మండలకేంద్రంలోని అగ్నిజ్వాల పెంతకోస్తు ప్రార్థనా మందిరంలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఏఎంసీ చైర్మన్ ఎల్లయ్య కేక్ కట్‌చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. తహసీల్దార్ విజయప్రకాశ్‌రావు, పాస్టర్ విద్యానందం, కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషా, మాలమహానాడు అధ్యక్షుడు శ్రీనివాస్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలో ఐపీసీ యంగ్ హోలీటీమ్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ పరిచాలకులు శామ్యూల్, డేనియల్, అమృతరావు, తేజ, దీవెన, మమత తదితరులు పాల్గొన్నారు.

చందుర్తి : మండలంలోని జోగాపూర్ వాగ్దేవి ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. పాఠశాల ఆవరణలో కేక్ కట్ చేసి, విద్యార్థులకు స్వీట్లను, కేక్‌ను పంపిణీ చేశారు. చిన్నారుల వేషధారణ ఎంతగానో ఆకట్టుకుంది. పాఠశాల సిబ్బంది ప్రతిభ, మల్లేశ్వరి, సంధ్యారాణి, వనజ, మౌనిక, మాధవి, కవిత, శిరీషా, అనిత, శ్రీలత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: మండలంలోని రంగంపేటలో గ్లోరియస్ గాస్పల్ చర్చ్ లో ముందస్తు క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, క్రైస్తవులు తదితరులు పాల్గొన్నారు.

## సంక్షిప్త వార్తలు

**● అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు సరికాదు**

బోయినపల్లి: డా. బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్రహోం శాఖ మంత్రి అమిత్‌షా పార్లమెంట్‌లో చేసిన అనుచిత వ్యాఖ్యలు సరికాదని కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జంగం అంజయ్య పేర్కొన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అమిత్‌షాను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్‌చేశారు. ఆయన వెంట ఏఎంసీ డైరెక్టర్ నీరటి ప్రదీప్, మాల మహానాడు మండల అధ్యక్షుడు ర్యాకం రాజేశ్, ర్యాకం రాజశేఖర్, ర్యాకం మహేందర్ తదితరులు ఉన్నారు.

**● ఠాణాకు ఇసుక టిప్పర్ల తరలింపు**

కోనరావుపేట: మండలంలోని బావుసాయిపేట వాగునుంచి రెండు ఇసుక టిప్పర్లను కోనరావుపేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బావుసాయిపేట మూలవాగు నుంచి రుద్రంగి వద్ద జరుగుతున్న శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్ట్ పనులను ఇసుకను తరలిస్తున్నారు. టిప్పర్ యజమానులు సమయపాలన పాటించకుండా అధికారులు రాకముందే వాగులోకి దిగి ఇసుకను లోడ్ చేస్తుండగా పోలీసులు పట్టుకుని ఠాణాకు తరలించారు.

**● నేడు నీటి విడుదల**

ఎల్లారెడ్డిపేట: రాచర్లబొప్పాపూర్ శివారులోని సింగసముద్రం ఆయకట్టుకు నీటిని బుధవారం విడుదల చేయడానికి అధికారులు, రైతులు నిర్ణయించారు. ఎల్లారెడ్డిపేట గ్రామపంచాయతీ కార్యాలయంలో కాళేశ్వరం ప్యాకేజీ–9 డీఈ సత్యనారాయణ, ఏఈ మద్దుల వెంకటరెడ్డితో రైతులు మంగళవారం సమావేశమయ్యారు. సింగసముద్రం ఆయకట్టు 1600 ఎకరాలకు సాగునీటిని విడుదల చేయాలని నిర్ణయించినట్లు అధికారులు పేర్కొన్నారు. సమావేశంలో తహసీల్దార్ రామచంద్రం, డీటీ సత్యనారాయణ, ఆర్ఐ సంతోష్, మాజీ సర్పంచులు కొండాపురం బాల్‌రెడ్డి, దేవానందం, రైతులు పాల్గొన్నారు.

**● స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యం**

ముస్తాబాద్: గ్రామస్థాయిలో బూత్ కమిటీలతో బీజేపీని బలోపేతం చేస్తున్నామని బీజేపీ మండల అధ్యక్షుడు మెరుగు అంజాగౌడ్ తెలిపారు. మండలంలోని 22 గ్రామాల్లో బీజేపీ బూత్ కమిటీలను నియమిస్తున్నామన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా బీజేపీ పనిచేస్తుందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించాలని కోరారు.

**● గిరిజన మహిళా డిగ్రీ కళాశాలకు బీ ప్లస్ ప్లస్ గ్రేడ్**

తంగళ్లపల్లి: మండలకేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలకు న్యాక్ బీ ప్లస్ ప్లస్ గ్రేడ్ వచ్చినట్లు మంగళవారం ప్రిన్సిపాల్ రెహానా ఇఫ్బత్ ఒక ప్రకటనలో తెలిపారు. న్యాక్ నిపుణుల బృందం ఈనెల 9, 10 తేదీల్లో కళాశాలను సందర్శించి పరిశీలించారని, బీ ప్లెస్‌ప్లెస్ గ్రేడ్ సాధించడంపై వారు హర్షం వ్యక్తంచేశారు.

**● ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులతో బోధన**

ఇల్లంతకుంట: మండలకేంద్రంలోని కేజీబీవీ పదో తరగతి విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులతో బోధన చేస్తున్నట్లు మండల విద్యాధికారి సీహెచ్ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఈనెల 10నుంచి కేజీబీవీ సిబ్బంది, ఎంఈవో కార్యాలయ కాంట్రాక్టు సిబ్బంది, నిరవధిక సమ్మెలో పాల్గొంటున్నారు. పది విద్యార్థులకు సిలబస్‌లో ఇబ్బంది కలుగకుండా ఉండేందుకు మండలంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలల లోని ఉపాధ్యాయులతో వంతుల వారీగా విద్యాబోధన చేస్తున్నట్లు చెప్పారు.

**● ఏఎంసీ డైరెక్టర్ మృతికి సంతాపం**

బోయినపల్లి: ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన ఏఎంసీ డైరెక్టర్ గంగిపెల్లి లచ్చయ్య సంతాప సభను బోయినపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఏఎంసీ చైర్మన్ బోయిని ఎల్లేశ్‌యాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఏఎంసీ కార్యదర్శి రమణ, సెస్‌డైరెక్టర్ కొట్టెపెల్లి సుధాకర్, కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కూస రవీందర్, రమణారెడ్డి, జంగం అంజయ్య, కట్ట లచ్చయ్య, బీ.మహేశ్‌రెడ్డి, వీసీ. వినోద్ రెడ్డి, నగేశ్, శంకర్, మహేందర్, మెరుపుల మహేశ్, పిట్టల రమేశ్, ఉయ్యాల శ్రీనివాస్, ద్యావ మహిపాల్‌రెడ్డి, పలువురు ఏఎంసీ డైరెక్టర్లు ఉన్నారు.

## కేటీఆర్‌ను ఎదుర్కోలేక అక్రమ కేసులు



మాట్లాడుతున్న రవి గౌడ్

తంగళ్లపల్లి: కేటీఆర్‌ను రాజకీయంగా ఎదుర్కోలేక సీఎం రేవంత్‌రెడ్డి అక్రమ కేసులు బనాయిస్తున్నారని, సంక్షేమంపై ప్రశ్నిస్తే సంకెళ్లు వేయిస్తున్నారని బీఆర్ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర నాయకులు కంచర్ల రవి గౌడ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి కేవలం కక్ష సాధింపుల కోసమే ముఖ్యమంత్రి అయినట్లు ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైతే వారిని ప్రశ్నిస్తున్నందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై అక్రమ కేసులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సీఎం కళ్లు తెరిచి రాష్ట్రంలోని సమస్యలపై దృష్టిసారించాలని, హామీల అమలుకు కసరత్తు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు మట్టె శ్రీనివాస్, ముగ్ధం అనిల్‌గౌడ్, కోడం వెంకటేశ్, మేడ సాయి, రుద్రవేణి సుదీప్, రంజిత్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

### కళాకారుడికి సత్కారం

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండలంలోని నూకలమర్రికి చెందిన కళాకారుడు తీగల రాజేశంగౌడ్‌ను ఘనంగా సత్కరించారు. హైదరాబాద్‌లో ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సారంపల్లి కొండల్‌రావు, కెవి రమణాచారి, పలువురు కళాకారులు పాల్గొన్నారు. తీగల రాజేశంగౌడ్‌ను మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాలకుర్తి పర్శరాములు, గ్రామస్తులు అభినందించారు.

### పుష్పగుచ్ఛం అందజేత

తంగళ్లపల్లి: నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ జస్టిస్ మూమెంట్ జాతీయ అధ్యక్షుడు మహమ్మద్ హర్షద్ ఖాన్, తెలంగాణ అధ్యక్షుడు మహమ్మద్ యూసూఫ్‌ను మంగళవారం హైదరాబాద్‌లో సిరిసిల్ల జిల్లా నాయకులు కలిసి పుష్పగుచ్ఛం అందించారు. వరల్డ్ హ్యూమన్ రైట్స్ అవర్నెస్ ప్రోగ్రాం హైదరాబాద్‌లో జరగగా జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ హమీద్, జిల్లా కోఆర్డినేటర్ సాగర్ పాల్గొన్నారు.

### నియామకం



కోనరావుపేట: మండలంలోని అన్ని గ్రామాల్లో బీసీ యువజన విభాగం గ్రామాలవారీగా అధ్యక్షులను నియమించినట్లు మండల శాఖ అధ్యక్షుడు ఎక్కల్‌దేవి జలేందర్ తెలిపారు. బైరగోని వినేష్ (బావుసాయిపేట అధ్యక్షుడు), జాప తిరుపతి (ధర్మారం), దండు నవీన్ (ఎగ్లాస్‌పూర్), మోతుకుపెల్లి ప్రశాంత్ (కనగర్తి), ఇమ్మడిశెట్టి వినోద్ (కొలనూర్), బోయిని ప్రవీణ్ (కోనరావుపేట), ప్రశాంత్ (కొండాపూర్), పయ్యావుల సందీప్ (మల్కపేట), మారుపాక అనిల్‌కుమార్ (మామిడిపల్లి), కోరెపు చంద్రకాంత్ (శివంగాలపల్లి), మెండె వెంకటేశ్ (సుద్దాల), గంగారాం సంపత్‌కుమార్ (వట్టిమల్ల), కర్నాల మహేశ్ (వెంకట్రావుపేట), బుర్ర ఆంజనేయులు (రామన్నపేట) లను నియమించినట్లు పేర్కొన్నారు. యూత్ విభాగం జాతీయ కార్యదర్శి అమరగొండ అజయ్, బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ వంగ వంశీకృష్ణ, మండల ఉపాధ్యక్షుడు అబ్బసాని సందీప్, అభిషేక్, సాయి, మధు, భూమేశ్ తదితరులు పాల్గొన్నారు.

### విహారయాత్రకు విద్యార్థులు



మక్కామసీద్ ముందు విద్యార్థులు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని వెంకటాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు మంగళవారం విజ్ఞాన విహారయాత్రకు వెళ్లారు. ఏడు నుంచి పదో తరగతి చదువుతున్న వందమంది విద్యార్థులు హైదరాబాద్‌లోని చార్మినార్, మక్కామసీద్, చౌమహల్లా ప్యాలెస్, గోల్కొండ కోట, బిర్లామందిర్, ప్లానెటోరియం, సెక్రటేరియట్, అసెంబ్లీ, అంబేడ్కర్ విగ్రహాలను సందర్శించారు.

### మండలంలో 68 శాతం సర్వే పూర్తి

ఇల్లంతకుంట : మండలంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే 68శాతం పూర్తయినట్లు ఎంపీడీవో శశికళ మంగళవారం తెలిపారు.ఆయా గ్రామాల్లో కార్యదర్శులు సర్వే చేస్తున్నారన్నారు. ఈనెల ఈనెల 31వరకు సర్వే కొనసాగనున్నట్లు తెలిపారు.

# రాజన్న సేవలో అయ్యప్ప భక్తులు



రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు



కోడెమొక్కు చెల్లించుకుంటున్న నర్సంపేట ఎమ్మెల్యే మాధవ్‌రెడ్డి కుటుంబ సభ్యులు

వేములవాడ: రాజన్నకు మంగళవారం సైతం భక్తుల రద్దీ పోటెత్తింది. అయ్యప్ప దీక్షాపరులు పెద్ద ఎత్తున స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ్‌రెడ్డి కుటుంబ సమేతంగా రాజన్నను దర్శించుకుకొని, కోడె మొక్కు చెల్లించుకున్నారు. అనంతరం నాగిరెడ్డి మండపంలో ఎమ్మెల్యే కుటుంబ సభ్యులను సత్కరించారు. ప్రొటోకాల్ ఏఈవో అశోక్, పర్యవేక్షకుడు తిరుపతిరావు, అర్చకులు పాల్గొన్నారు.

### అయ్యప్ప పల్లకీ సేవ



ముస్తాబాద్: మండలంలోని ఆవునూర్‌లో అయ్యప్ప పల్లకీసేవ రాజుగురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. పల్లకీపై స్వామివారి ఉత్సవ మూర్తితో పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ చీటి జితేందర్‌రావు, గురుస్వాములు రాజిరెడ్డి, నాగరాజు, కిషన్‌రావు, వేణు, రవి, శ్రీను, అంజాగౌడ్, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

### విప్‌ను కలిసిన నూతన కార్యవర్గం

తంగళ్లపల్లి: మండల ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గం మంగళవారం ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే.మహేందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు మోర శ్రీకాంత్ మాట్లాడుతూ నూతన ప్రెస్‌క్లబ్ భవనం నిర్మాణానికి సహకరించిన ప్రభుత్వవిప్, కేకేకు ధన్యవాదాలు తెలిపారు. ప్రెస్‌క్లబ్ ఉపాధ్యక్షుడు దుబ్బాక రాజు, ప్రధాన కార్యదర్శి రెడ్డి రాజశేఖర్, కోశాధికారి గదగోని సాగర్, సహాయ కార్యదర్శి గ్యాదనవేని మధు, సాంస్కృతిక కార్యదర్శి రెడ్డిమల్ల దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

# కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

- తంగళ్లపల్లి గుట్టపై లక్ష్మీనరసింహ స్వామి ఆలయం
- మినీ యాదగిరి గుట్టగా ప్రాచుర్యం
- నిత్య పూజలు, తరలివస్తున్న భక్తులు



తంగళ్లపల్లి గుట్టపై లక్ష్మీనరసింహ స్వామి ఆలయం

తంగళ్లపల్లి: మినీ యాదాద్రి (యాదగిరి గుట్ట)గా మండలకేంద్రంలోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయం ప్రాచుర్యం సంతరించుకుంటోంది. మానేరు నదీ తీరాన తంగళ్లపల్లి గుట్టపై నిర్మించిన ఆలయంలో స్వామివారు స్వయం భూగా వెలిశారని భక్తులు విశ్వసిస్తారు. కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా శ్రీలక్ష్మీనరసింహ స్వామిని కొలుస్తారు. జిల్లాలోని చుట్టుపక్కల గ్రామాల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తున్నారు.

**కనుల పండువగా బ్రహ్మోత్సవాలు..**

ఆలయం నిర్మాణం జరిగి ఏడాది పూర్తయిన సందర్భంగా ప్రథమ వార్షికోత్సవాన్ని ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈనెల 23 నుంచి లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభం కాగా బుధవారం వరకు కొనసాగుతాయని మయూరగిరి పీఠాధీశులు శతాధిక ప్రతిష్టాపనాచార్యులు, జ్యోతిష్య వాస్తు ఆగమ శాస్త్ర పండితుడు శ్రీమాన్ నమిలికొండ రమణాచార్య స్వామివారు తెలిపారు. బుధవారం ఉదయం 8:50 గంటలకు సేవాకాలం, హోమాలు, సామూహిక సుదర్శన లక్ష్మీనరసింహ హోమం మహాపూర్ణాహుతి, చక్రస్నానం, బలిహరణం, తీర్థప్రసాద వితరణ. సాయంత్రం 5 గంటలకు శ్రీ విష్ణుసహస్రనామ పారాయణం, ద్వాదశ ఆరాధనలు, సప్తావరణలు, వాహనసేవ, ఏకాంత సేవ, ఆశీర్వచనాలు, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.

**రూ.50 లక్షలతో ఆలయ నిర్మాణం**



మానేరు నదీ తీరాన లక్ష్మీనరసింహ స్వామి ఆలయం గుట్టపై ఎన్నో ఏళ్ల నుంచి ఉంది. నూతన ఆలయాన్ని రూ.50 లక్షలతో సుందరంగా నిర్మించి పునఃప్రతిష్టాపన చేశారు.

– మచ్చ శ్రీనివాస్, ఆలయ కమిటీ అధ్యక్షుడు

**అన్ని సౌకర్యాలు కల్పించారు**



మూడు రోజులపాటు జరుగుతున్న శ్రీ లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు.

– గజభీంకార్ రాజన్న, భక్తుడు తంగళ్లపల్లి

**ఇద్దరికి తీవ్రగాయాలు**

వేములవాడఅర్బన్: అగ్రహారం శివారులోని రహదారిపై బైక్ టైరు పేలి ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. మంగళవారం వేములవాడ వైపు ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఇద్దరు టైర్ పేలడంతో అదుపుతప్పి కిందపడిపోయారు. స్థానికులు 108కు సమాచారం ఇవ్వగా చికిత్స నిమిత్తం వేములవాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు.